
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
ఆదివారం 21 జనవరి 2024


విక్టరీ సింబల్ చూపుతున్న చంద్రబాబునాయుడు

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

నిధుల కేటాయింపు

- అరకు ప్రాంతంలో వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తాం
- గిడ్డంకులు, ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంటు ఏర్పాటు
- టీడీపీ ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే... వైసీపీ గంజాయిని ప్రమోట్ చేసింది
- ఏజెన్సీలో ఉద్యోగాలు 100 శాతం గిరిజనులకు దక్కేలా టీడీపీ జీవో 3 తీసుకువస్తే జగన్ దానిని రద్దు చేశారు
- గిరిజనులకు సంబంధించి 16 పథకాలు రద్దు చేశారు
- మన్యంలో లేటరైట్ పేరిట బాక్సైట్ దోపిడీ
- కులం, మతం పేరుతో జగన్ చేస్తున్న మోసాలకు ఎవరూ బలికావద్దు
- ఐదేళ్లలో అనేక రెట్లు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు
- రుషికొండకు బోడిగుండు కొట్టించారు...మరోసారి వస్తే అరకు కొండలకు గుండుగీత
- అరకు సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు

డుంబ్రిగుడ/పాడేరు/అరకులోయ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నిధులు కేటాయిస్తామని తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. 'రా...కదలిరా' పేరుతో శనివారం మధ్యాహ్నం అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం అరకులో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. అరకు ప్రాంతంలో వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని, గిడ్డంగులు ఏర్పాటుచేసి ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంటు నెలకొల్పుతామని చెప్పారు.

ప్రకృతి రమణీయతతోపాటు ప్రశాంతంగా ఉండే అరకు అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. ఈ ప్రాంతంలో పండించే కాఫీకి బ్రాండింగ్ చేసింది తానేనన్నారు. నాంది ఫౌండేషన్‌ను మహీంద్ర కంపెనీ నిర్వహిస్తున్నప్పుడు సామాజిక బాధ్యతగా కాఫీ సాగును ప్రోత్సహించాలని సూచించానని అప్పటి విషయాలను గుర్తుచేసుకున్నారు. దేశంలో అనేక రకాల కాఫీలున్నా అరకు కాఫీకి ప్రత్యేక రుచి ఉంటుందన్నారు. ప్యారిస్‌లో ... మిగతా 8వ పేజీలో


డుంబ్రిగుడ మండలం అరకులో రా.. కదలిరా సభకు హాజరైన అశేష జనం

సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

మరికొన్ని ఫొటోలు 7వ పేజీలో..

చంద్రబాబుకు బ్రహ్మరథం

అరకులో 'రా...కదలిరా' సభకు అశేషంగా తరలివచ్చిన జనం

- ఉత్సాహంగా ప్రసంగించిన టీడీపీ అధినేత
- ఇంత ఆదరణ చూపుతున్న గిరిజనులను తన జన్మలో మరిచిపోలేనని వెల్లడి

అరకులోయ/డుంబ్రిగుడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు గిరిజనులు బ్రహ్మరథం పట్టారు. 'రా...కదలిరా' పేరుతో జిల్లాలోని డుంబ్రిగుడ మండలం అరకులో పార్టీ నిర్వహించిన సభకు పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. అరకులో ఇంత ఆదరణ చూపుతున్న గిరిజనులను ... మిగతా 8వ పేజీలో


థింసా కళాకారులతో చంద్రబాబునాయుడు

అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొర

- ప్రకటించిన చంద్రబాబునాయుడు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో బాబు స్వయంగా ప్రకటించిన తొలి సీటు ఇదే



అరకులోయ/డుంబ్రిగుడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎవరనే దానిపై పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు స్పష్టత ఇచ్చారు. రా..కదలిరా సభలో అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొరేనని, ఆయనను అందరూ గెలిపించాలని సూచించారు. ఎటువంటి అపోహలకు తావులేకుండా పార్టీ నేతలంతా సమష్టిగా పనిచేసి ... మిగతా 8వ పేజీలో

అనారోగ్యంతో అంగన్‌వాడీ మృతి

ముంచంగిపుట్టు, జనవరి 20: మండలంలోని దారెల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ పి.సౌభాగ్య(26) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమె మృతితో కుటుంబ సభ్యులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు శోకసంద్రంలో మునిగిపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో చురుగ్గా పాల్గొంటూ శిబిరంలో పలు మార్లు దీక్షలో కూర్చున్న సౌభాగ్య మృతి చెందడంతో సహచర అంగన్‌వాడీలు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆమె అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో జరిగాయి. ఆమెకు భర్తతో పాటు 10 నెలల వయస్సు గల కుమారుడు ఉన్నారు.


మృతి చెందిన సౌభాగ్య (ఫైల్)


ముంచంగిపుట్టు మండలం దారెల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సౌభాగ్య మృతి చెందడంతో చింతపల్లిలో నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా పలు విధాలుగా ఆందోళనలు చేస్తున్నారు. కాగా ముంచంగిపుట్టు మండలం దారెల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సౌభాగ్య అనారోగ్యంతో మృతి చెందడంతో పలు చోట్ల ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఎన్‌టీఆర్, ఏఎన్‌ఆర్ సినీ పరిశ్రమకు రెండు కళ్లు: చిరంజీవి


ఎన్టీఆర్, ఏఎన్నార్, హరివంశరాయ్ బచ్చన్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న చిరంజీవి, ఎంపీ లావు కృష్ణదేవరాయులు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తదితరులు

తెలుగు సినిమా రంగానికి ఎన్‌టీఆర్, ఏఎన్‌ఆర్ రెండు కళ్లు లాంటి వారని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి అన్నారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ 28వ పుణ్యతిథి, ఏఎన్‌ఆర్ శత జయంతి కార్యక్రమం శనివారం రుషికొండ ఏ1 గ్రాండ్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు చిరంజీవి, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తదితరులు పాల్గొని ఎన్టీఆర్, ఏఎన్నార్, హరివంశరాయ్ బచ్చన్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

- వార్త చిత్రజ్యోతిలో..

దట్టంగా పొగమంచు

జి.మాడుగులలో 11.9, అరకులోయలో 12.9 డిగ్రీలు నమోదు

పాడేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మన్యంలో చలితో పాటు పొగమంచు సైతం దట్టంగానే కురుస్తున్నది. జి.మాడుగులలో 11.9, అరకులోయలో 12.9, పాడేరులో 13.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. గత ఐదు రోజులుగా ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు పొగ మంచు దట్టంగానే కమ్ముకుంటున్నది.

దీంతో రోడ్డు మార్గం సైతం కనిపించని విధంగా ఉండడంతో వాహనాల డ్రైవర్లు హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే పగటి వేళల్లో సైతం ఆకాశం మబ్బులు పడుతూ సంపూర్ణంగా ఎండ కాయడం లేదు. దీంతో పగలు సైతం చలి ప్రభావం ఉంటూ, రాత్రి వేళల్లో తీవ్రత అధికంగా ఉంటున్నది.


పాడేరులో శనివారం ఉదయం దట్టంగా కమ్ముకున్న పొగమంచు

చింతపల్లి, జీకేవీధిలో 14.3 డిగ్రీలు

చింతపల్లి: మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినా చలిలో ఏ మాత్రం మార్పులేదు. శనివారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో 14.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ఉదయం, సాయంత్రం శీతలగాలులు అధికంగా వీస్తున్నాయి. చలితో పాటు మంచు దట్టంగా కురుస్తున్నది. ఉదయం పదిన్నర గంటల వరకు చింతపల్లి, లంబసింగి, తాజంగి, జీకేవీధి, ఆర్‌వీనగర్ ప్రాంతాల్లో మంచు వీడడంలేదు. చలి, మంచు వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా నెలాఖరు వరకు ఏజెన్సీ వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పర్యాటకుల సందడి

లంబసింగి, వంజంగికి పోటెత్తిన సందర్శకులు

పాడేరురూరల్, జనవరి 20: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు పర్యాటకుల రద్దీ కొనసాగుతోంది. శనివారం పాడేరు మండలంలోని వంజంగి మేఘాల కొండకు పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఎక్కువ మంది శుక్రవారం రాత్రే పాడేరు చేరుకున్నారు. శనివారం వేకువజామున వంజంగి మేఘాల కొండకు తరలివెళ్లారు. అక్కడ మంచు మేఘాలను తిలకించి పరవశించారు.

చెరువులవేనంలో పర్యాటకులు



లంబసింగిలో..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకులు పోటెత్తారు. ఎక్కువ మంది పర్యాటకులు శుక్రవారమే లంబసింగికి చేరుకుని స్థానికంగా బస చేశారు. మరికొంత మంది పర్యాటకులు శనివారం వేకువజామున వచ్చారు. చెరువులవేనం వ్యూపాయింట్ ఉదయం నుంచే పర్యాటకులతో కిటకిటలాడింది. మంచు అందాలను తిలకిస్తూ ఫొటోలు తీసుకునేందుకు పర్యాటకులు పోటీ పడ్డారు. అలాగే యర్రవరం జలపాతం వద్దకు కూడా భారీగా పర్యాటకులు వచ్చారు. సాయంత్రం వరకు లంబసింగి పరిసర పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో రద్దీగా కనిపించాయి.

బల్యగుడ.. ఏదీ అభివృద్ధి జాడ

కనీస సౌకర్యాలు లేక జనం అవస్థలు

రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇక్కట్లు

డుంబ్రిగుడ, జనవరి 20: మండలంలోని కొర్రా పంచాయతీ బల్యగుడ గ్రామంలో కనీస సౌకర్యాలు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో కనీస సౌకర్యాలకు నోచుకోక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామానికి టీడీపీ హయాంలో నిర్మించిన మట్టి రోడ్డు శిథిలావస్థకు చేరడంతో రవాణా కష్టాలు వెంటాడుతున్నాయి. గ్రామస్థులు అనారోగ్యానికి గురైతే అంబులెన్స్ గ్రామానికి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో వరద నీరంతా ఒకేచోట నిల్వ ఉండిపోతోంది.


అభివృద్ధికి నోచుకోని బల్యగుడ గ్రామం


పునాదుల స్థాయిలో ఉన్న పాఠశాల భవనం

దీనివల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 25 మంది బాలలు విద్యనభ్యసిస్తున్నారు. టీడీపీ హయాంలో చేపట్టిన పాఠశాల భవన నిర్మాణం పునాదుల స్థాయిలోనే నిలిచిపోయింది. ప్రభుత్వం నిధులను దారి మళ్లించడంతో పాఠశాల భవనం లేక బాలలు ఆరుబయటే చదువుకుంటున్నారు. వర్షాకాలంలో తరగతుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తమ పిల్లల చదువులు సజావుగా సాగడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికార యంత్రాంగం స్పందించి కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.


దారుణంగా ఉన్న బల్యగుడ రోడ్డు


చిరునవ్వులు చిందిస్తూ సభా వేదికపై చంద్రబాబునాయుడు అభివాదం


డుంబ్రిగుడ మండలం అరకులో టీడీపీ నిర్వహించిన రా... కదలిరా బహిరంగ సభకు హాజరైన జనసందోహం


చంద్రబాబుకు బొకే అందిస్తున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

కదలివచ్చిన 'గిరి'జనం

అందాల అరకు పసుపుమయమైంది. కొండ కోనల్లోని అడవిపుత్రుల్లో సైతం ఆనందం వెల్లివిరిసింది. తమ భవితకు భరోసా కల్పించే గొంతు నుంచి వచ్చే మాటలు వినేందుకు ఇంటిల్లిపాదీ కదలి వచ్చింది. ఫలితంగా ఆ ప్రాంతం జనసందోహమైంది. 'రా.. కదలిరా' పేరిట టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన భారీ బహిరంగ సభకు శనివారం విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి రోడ్లన్నీ అరకు వైపే అన్నట్టుగా అశేష జనం వడివడిగా అడుగులు వేసుకుంటూ విచ్చేశారు. ఇక తెలుగుతమ్ముళ్లలో ఉత్సాహం ఉరకలేసింది. పార్టీ జెండాలు చేతబట్టి.. జేజేలు కొడుతూ తమ ప్రియతమ నేతకు ఘనస్వాగతం పలికారు. ఇక్కడి కోలాహల వాతావరణం చూసిన చంద్రబాబు సైతం రెట్టించిన ఉత్సాహంతో ప్రసంగం చేసి ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఈ సభ విజయవంతం కావడంతో అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని తెలుగుదేశం పార్టీ కేడర్‌లో కొంగొత్త ఉత్సాహం కనిపిస్తోంది. - పాడేరు


బాబు ప్రసంగానికి కేరింతలు కొడుతున్న గిరిజన మహిళలు


సభా వేదికపై ఆసీనులైన పాడేరు, అనకాపల్లి జిల్లాల్లోని టీడీపీ నాయకులు


బాబుకు బొకే అందించి స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు అబ్రహం


చంద్రబాబు సభకు తరలి వస్తున్న ప్రజానీకం


అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా దొన్నుదొరను ప్రకటిస్తున్న చంద్రబాబు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చంద్రబాబు


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం


సభకు హాజరైన టీడీపీ మహిళా నేతలు

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో క్లీనర్ మృతి

పరవాడ, జనవరి 20: అనుమానాస్పద స్థితిలో ట్రాలీ లారీ క్లీనర్ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గుడివాడ మండలం మోపూరుకు చెందిన పిళ్లా నాగేశ్వరరావు (65) కొన్నేళ్లుగా లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 18న మునగపాక మండలం వెంకటాపురం క్లాసిల్ పరిశ్రమ నుంచి ఇక్కడి ఇండస్ట్రియల్ పార్కులో గల టీకే స్టీల్ పరిశ్రమకు ఐరన్ లోడు కోసం వెళ్లాడు. అదే రోజు రాత్రి డ్రైవర్, క్లీనర్ నాగేశ్వరరావు కలిసి భోజనం చేశారు. రాత్రి పది గంటల సమయంలో నాగేశ్వరరావు మంచినీటి కోసం పరిశ్రమ గేటు వద్దకు వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కంపెనీకి చెందిన కార్మికులు అతన్ని అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శనివారం కుటుంబసభ్యులకు అప్పగించారు. సీఐ బాల సూర్యారావు పర్యవేక్షణలో ఎస్‌ఐ తేజేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

- స్వల్ప గాయాలతో బయటపడిన భార్య, పిల్లలు
- వేపాడ మండలం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఘటన

దేవరాపల్లి, జనవరి 20: మండలంలోని కాశీపురం సచివాలయం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలకు గురై కేజీహెచ్‌లో చావుబ్రతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్నాడు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడుకు చెందిన భూమిరెడ్డి శంకరరావు శుక్రవారం దేవరాపల్లి మండలం కలిగొట్లలో జరిగిన తీర్థానికి తన చెల్లెలు ఇంటికి భార్య, పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. రాత్రి కాశీపురం సచివాలయం సమీపానికి చేరగా మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. దీంతో హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ శంకరరావు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా, అతని భార్యా పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు.

కుక్కల దాడిలో పదకొండు గొర్రెలు మృతి

మాకవరపాలెం, జనవరి 20 : మండలంలోని రామరాయుడుపాలెంలో శనివారం రాత్రి వీధికుక్కల దాడిలో పదకొండు గొర్రెలు మృతిచెందాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. బూరుగుపాలెం పంచాయతీ శివారున గల ఈ గ్రామంలో పోతల తాతయ్యలు తన గొర్రెలను ఉదయం మేతకు తీసుకు వెళ్లాడు. సాయంత్రం మేత అనంతరం ఇంటికి కొంత దూరంలో ఉన్న పశువుల పాక వద్ద వాటిని కట్టి వెళ్లిపోయాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో తిరిగి పశువుల పాకవద్దకు వచ్చి చూడగా, కుక్కల గుంపు కనిపించింది. భయంతో చుట్టుపక్కల వారిని పిలిచి వారితో కలిసి వెళ్లి చూడగా పదకొండు గొర్రెలు చనిపోయి కనిపించాయి. దీంతో బోరున విలపించాడు.


కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

రహదారి ప్రమాద ప్రాణదాతకు రూ. ఐదువేలు

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 20: రహదారి ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్ సమయంలో ఆస్పత్రి లేదా ట్రామాకేర్ సెంటర్‌కు తరలించి తగిన చికిత్సను అందించిన ప్రాణదాతలకు ప్రభుత్వం రూ. ఐదు వేలు నగదు, ప్రశంసాపత్రం ఇస్తుందని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి తెలిపారు. శనివారం శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన రవాణా శాఖ ముద్రించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పక పాటించాలన్నారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగినట్టయితే తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.దయానిధి, జిల్లా రవాణా అధికారి కేవీ ప్రకాశరావు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

సీఎంతో సహా వైసీపీ నేతలకు ఓటమి భయం

- టీడీపీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజదీశ్


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు

అనకాపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సభలకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనను చూసి సీఎం జగన్‌రెడ్డితో సహా వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు విమర్శించారు. శనివారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి అన్ని వర్గాల ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నాయకులకు నవరత్రాలపై నమ్మకం లేక దొంగ ఓట్లపైనే ఆధారపడ్డారని ఎద్దేవా చేశారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో కూడా దొంగ ఓట్లు నమోదు చేశారని, దీనిపై గతంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఈనెల 22న తుది జాబితా ప్రకటించే ముందు తమ ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా తుది జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగన్‌రెడ్డి సాగునీరు ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని, కనీసం గ్రోయిన్ల మరమ్మతులు, పంట కాలువల జంగిల్ క్లియరెన్స్ చేయలేదన్నారు. అంగన్‌వాడీలు తమ సమస్యలపై ఆందోళన చేస్తుంటే జిల్లా మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు కనీసం వారి గోడు వినలేదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, షేక్ బాబర్, బొడ్డేడ మురళి, కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

సినీ రచయిత జేకే.భారవికి 'వేటూరి' పురస్కారం


జేకే.భారవి

పాయకరావుపేట, జనవరి 20: స్థానిక వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఏటా ఇస్తున్న 'వేటూరి' కవితా పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు జేకే.భారవికి అందజేయనున్నట్టు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వరశర్మ తెలిపారు. శనివారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా జనవరి 29వ తేదీన 'వేటూరి' జన్మదినం పురస్కరించుకుని సినీ, సాహితీరంగ ప్రముఖులకు 'వేటూరి' సాహితీ పురస్కారం ఇచ్చి సత్కరిస్తున్నామన్నారు. ఈఏడాది వేటూరి కవితా పురస్కారాన్ని జేకే.భారవిని ఎంపిక చేశామన్నారు. శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 29న తునిలో నిర్వహించనున్న పురస్కార కార్యక్రమానికి సాహితీ ప్రియులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

'డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్‌లో ఉద్యోగాలకు ఆహ్వానం'

అనకాపల్లి టౌన్, జనవరి 20: డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు ఒక ఏడాది తాత్కాలిక ప్రతిపాదనపై జరిపే నియామకాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యాధికారి, కౌన్సిలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అర్హత గల వారు అన్ని సర్టిఫికెట్లను జతపరచి దరఖాస్తులను తన కార్యాలయానికి ఈనెల 30వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు అందజేయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు అనకాపల్లి.ఏపీ. జీవోవి.ఇన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఏయూ వీసీగా ప్రసాదరెడ్డి బాధ్యతలు స్వీకారం

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా రెండో పర్యాయం నియమితులైన ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో ఏయూను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. దానికి ఇటీవల నాక్ ఏ++ ర్యాంకు సాధించడమే నిదర్శనమన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఏయూ అభివృద్ధి సాధించిందన్నారు. 2025-26లో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు ప్రధాని, రాష్ట్రపతిని ఆహ్వానిస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరెడ్డికి ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ కె.సమత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ఏయూ పూర్వ వీసీ ప్రొఫెసర్లు బీల సత్యనారాయణ, ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, పూర్వ రిజిస్ట్రార్ జి.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్స్ డీన్లు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించేందుకు వస్తున్న వీసీకి స్వాగతం పలుకుతూ కొంత మంది విద్యార్థులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. కొన్ని నిమిషాలపాటు బాణాసంచా శబ్దాలతో వర్సిటీ మార్మోగింది. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్‌రెడ్డి

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి


భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, జనవరి 20: మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు తెల్లవారుజామున పంచామృతాభిషేకం చేశారు. అనంతరం కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయిగోపాలాచార్యులు పూజలు, నిత్య హోమాలు చేశారు. కింద ఆలయంలో క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. అనేక మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కొండకర్ల ఆవలో సినీ నటి మంజుల షికారు

అచ్యుతాపురం, జనవరి 20: హీరో మహేష్‌బాబు సోదరి, సినీనటి మంజుల కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కొండకర్ల ఆవను సందర్శించారు. ఫైబర్ బోటులో వీరంతా కొండకర్ల ఆవలో షికారు చేశారు. బోటులో కుటుంబ సభ్యులతో సెల్ఫీ ఫొటోలు తీయడంతో పాటు ఆవలో తేలియాడే తామర పువ్వులు, తామర ఆకుల నడుమ బోటు ఆపి ఫొటోలు తీసుకున్నారు. ఆవ అందాలు అద్భుతంగా ఉన్నాయని, ఇంతకాలం తమకు తెలియక ఇక్కడకు రాలేకపోయానని ఆమె అన్నారని బోటు నిర్వాహకులు తెలిపారు. కొందరు ఆమెను గుర్తించి ఫొటోలు తీయడానికి ప్రయత్నించినా ఆమె వారించడంతో తియ్యలేదన్నారు.

వైసీపీ పాలనలో గిరిజనాభివృద్ధి వెనక్కి

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించే నేత చంద్రబాబు
- టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్

పాడేరు/అరకులోయ/డుంబ్రిగుడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నిరంకుశ పాలనతో గిరిజనాభివృద్ధి వెనక్కి వెళ్లిపోయిందని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. డుంబ్రిగుడ మండలం అరకులో శనివారం జరిగిన తెలుగుదేశం పార్టీ రా... కదిలిరా బహిరంగ సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి రాగానే ప్రజావేదికను కూల్చడంతో జగన్‌రెడ్డి నియంత పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. నాటి నుంచి కూల్చడం, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టడం, తనకు వ్యతిరేకంగా వున్న వాళ్లను భయభ్రాంతులకు గురిచేసి జైళ్లకు తరలించడం తప్పితే జగన్‌రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అటువంటి దుర్మార్గ పాలన సాగించిన జగన్‌రెడ్డికి 2024 ఎన్నికల్లో ఇంటికి పంపాలని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేలా టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు.

గిరిజన ద్రోహి జగన్‌ను ఇంటికి పంపాలి

- పాడేరు అసెంబ్లీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

గిరిజన ద్రోహి జగన్‌ను రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయమని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. వైసీపీ రాష్ట్రంలో అరాచకపాలన నడుస్తోందన్నారు. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి గిరిజనాభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. గిరిజనానికి గుండె కాయలాంటి జీవో నంబర్-3ను రద్దు చేస్తే నేటివరకు ఆ జీవో పునరుద్ధరణలో భాగంగా కోర్టులో కనీసం రివ్యూ పిటిషన్ సైతం వేయలేని దద్దమ్మ, చేతకాని ప్రభుత్వం అని ఆమె ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో గిరిజనులను నిర్లక్ష్యం చేసిన వైసీపీని గద్దెదింపడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

కనీస సదుపాయాలు కల్పించని ప్రభుత్వం

- పాలకొండ అసెంబ్లీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ

ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం వైసీపీ అని పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. 2024 ఎన్నికల్లో అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలను టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని, వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

బాబుతోనే అరకులోయ ప్రాంతం అభివృద్ధి

- ఎస్.కోట అసెంబ్లీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి

చంద్రబాబునాయుడు హయాంలోనే అరకులోయ ప్రాంతం అభివృద్ధి చెందిందని ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి అన్నారు. నాడు చంద్రబాబు సీఎంగా పెదలబుడు గ్రామ పంచాయతీని దత్తత తీసుకోవడంతో ఈ ప్రాంతం అభివృద్ధి జరిగిందన్నారు. అలాగే మారుమూల గిరిజన గ్రామాలకు వైద్యసేవలందించడానికి నాడు ఫీడర్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి అత్యవసర వైద్యసేవలను సైతం అందుబాటులోకి తెచ్చిన ఘనత చంద్రబాబుదన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో డోలీ మోతలతో గిరిజనం ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల ఎస్.కోట నియోజకవర్గంలో మారుమూల చిట్టంపాడుకు చెందిన గంగమ్మ అనే గర్భిణి ఆస్పత్రికి వెళ్లే దారిలేక, మార్గమధ్యంలోనే తల్లీబిడ్డ మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఈ నియంత పాలనకు స్వస్తి చెప్పి, టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు.

గిరిజనులను జగన్ బానిసలుగా చూస్తున్నారు

- పార్వతీపురం అసెంబ్లీ ఇన్‌చార్జి విజయ్‌చంద్ర

చంద్రబాబునాయుడు పాలనలో గిరిజనులను రాజులుగా చూస్తే, నేడు జగన్‌రెడ్డి పాలనలో వారిని బానిసలుగా చూస్తున్నారని పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌చంద్ర అన్నారు. నాడు గిరిజనాభివృద్ధికి తోడ్పాటుగా తెలుగుదేశం ప్రభుత్వం 22 సంక్షేమ పథకాలు అమలు చేస్తే, జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఆయా పథకాలను రద్దు చేశారన్నారు. అలాగే దళితులకు సంబంధించిన 27 హక్కులను రద్దు చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ఇటువంటి దళిత, గిరిజన వ్యతిరేకికి 2024 ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.



వేదికపై విక్టరీ సింబల్ చూపుతున్న చంద్రబాబు, పార్టీ ఇన్‌చార్జులు.. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న శ్రావణ్

పాలన చేతకాని అసమర్థ సీఎం జగన్

- రంపచోడవరం అసెంబ్లీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి

పాలన చేతకాని అసమర్థ సీఎం జగన్ అని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంతాల రాజేశ్వరి అన్నారు. పాదయాత్ర, ఎన్నికల సమయాల్లో కల్లబొల్లి మాయమాటలు చెప్పి అనేక హామీలు ఇచ్చి ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి అందరికీ అన్యాయం చేశారన్నారు. మాట తప్పను మడమతిప్పను అంటూనే తానిచ్చిన హామీలను సైతం నెరవేర్చలేకపోయారని ఆయన ఆరోపించారు. దళిత వ్యక్తిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును రక్షించి, సీఎం జగన్ తన పక్కన పెట్టుకోవడం దారుణమన్నారు. అందువల్ల వైసీపీని వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం చేస్తేనే దళితులు, గిరిజనులు, బడుగు వర్గాల ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు.

టీడీపీ, జనసేనతోనే రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధి

- అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర

తెలుగుదేశం, జనసేన పార్టీలు ఏర్పాటు చేసే ప్రభుత్వంతోనే రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో సైకో పాలన పోవాలంటే ప్రజలంతా ఏకమై తెలుగుదేశం, జనసేన అభ్యర్థులను గెలిపించుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు. అరకులో జరిగిన రా.. కదిలిరా బహిరంగ సభకు విచ్చేసిన గిరిజనాన్ని చూస్తే ఆకాశం పగిలిందా, భూమి ఈనిందా అన్నట్టు ఉందని, వారందరికీ పాదాభివందనం చేస్తున్నానని పేర్కొన్నారు.

నియంతపాలనతో జనం విసిగిపోయారు

- సాలూరు అసెంబ్లీ ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణి

జగన్‌రెడ్డి నియంత, సైకో పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగుచెందారని, వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ఇంటికి పంపించేందుకు నిర్ణయించుకున్నారని సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. వైసీపీ పాలనతో ప్రజలకు మేలు జరగలేదు, రాష్ట్రం అన్నింటా వెనక్కి పోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌తో పాటు దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపొందేలా టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు బలపర్చాలని కోరారు.

టీడీపీ, జనసేనలతోనే నీతివంతమైన పాలన

- జనసేన అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి గంగులయ్య

ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగుతున్నదని, భవిష్యత్‌లో టీడీపీ, జనసేన కలిసి నీతివంతమైన పాలన అందిస్తాయని జనసేన అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య అన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను జగన్‌రెడ్డి నాశనం చేశారని, రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడుకోవాలనే లక్ష్యంతోనే రెండు పార్టీలు కలిశాయన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు అన్ని విధాలుగా అభివృద్ధిలో నడవాలంటే, అన్ని వర్గాల హక్కులను కాపాడుకోవాలంటే ప్రస్తుత నియంత అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రతి ఒక్కరూ జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



మోదకొండమ్మ అమ్మవారికి బంగారు కిరీటం అలంకరించిన దృశ్యం

నేడు మోదకొండమ్మ తీర్థం

పాడేరు రూరల్, జనవరి 20: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు మోదకొండమ్మ వార్షిక తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఆలయ కమిటీ చైర్‌పర్సన్, స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ల ఆధ్వర్యంలో అమ్మవారికి బంగారు కిరీటం, వెండి సింహాలను అలంకరించారు. ప్రతీ ఏటా సంక్రాంతి తరువాత వచ్చే మొదటి ఆదివారం అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇందులో భాగంగానే 21వ తేదీన తీర్థం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు పర్యవేక్షణలో భారీగా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు.

సీలేరులో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

సీలేరు, జనవరి 20: సీలేరు జల విద్యుత్ కేంద్రం 220 కేవీ స్విచ్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 3.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సీఈ బి.శ్రీధర్ శనివారం ప్రారంభించారు. సీలేరు గ్రామానికి, జెన్‌కో కాలనీకి విద్యుత్ సరఫరా కోసం సీలేరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ 60 ఏళ్లు పూర్తికావడంతో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయి. ఏడీఈ శ్రీకాంత్ చొరవతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఆమోదం లభించింది. రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను సీఈ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కేవీవీ ప్రశాంత్‌కుమార్, ఈఈలు లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, ప్రభాకరరావు, ఏడీఈ శ్రీకాంత్, ఏఈలు శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలు 662 మంది హాజరు

పాడేరు రూరల్, జనవరి 20: జిల్లా పాడేరు డివిజన్ పరిధిలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 662 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని డిప్యూటీ డీఈవో చెల్లయ్య తెలిపారు. ఆరు పరీక్ష కేంద్రాలకు 1,035 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 373 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. జిల్లా పరిషత్ హైస్కూల్ చింతపల్లి సెంటర్‌లో 187 మంది హాజరు కావాల్సి ఉండగా 138 మంది హాజరయ్యారని, కొయ్యూరు జీటీడబ్ల్యూ బాలుర పాఠశాల్లో 155 మందికి 118 మంది, పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 192 మందికి 147 మంది, పాడేరు ఏపీఆర్ పాఠశాలలో 254 మందికి 84 మంది, అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 127 మందికి 71 మంది, అరకు సీపీహెచ్.స్కూల్ సెంటర్‌లో 120 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 104 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

చంద్రబాబుకు బ్రహ్మరథం

... 5వ పేజీ తరువాయి

తన జన్మలో మరిచిపోలేనంటూ చంద్రబాబునాయుడు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సభకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది హాజరుకావడంతో చంద్రబాబు సైతం ఎంతో ఉత్సాహంగా గంట సేపు ప్రసంగించారు. గిరిజనుల సమస్యలు, వారి జీవనోపాధి, అక్రమ మైనింగ్, పథకాలు రద్దు, తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. ఆయన ప్రసంగానికి గిరిజనులు పలుమార్లు స్పందిస్తూ హర్షధ్వానాలు చేశారు. సభ నిర్వహించిన 15 ఎకరాల ప్రదేశం జనంతో నిండిపోగా, చుట్టుపక్కల ఖాళీ ప్రదేశాలు, గుట్టలపై వేలాది మంది గిరిజనులు కూర్చొని బాబు ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. దీంతో చంద్రబాబునాయుడు అందరివైపు చూస్తూ విక్టర్ చిహ్నంతో అభివాదం చేయడంతో గిరిజనుల్లో మరింత ఉత్సాహం కనిపించింది. పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 40 వేల మంది వరకూ తరలివచ్చినట్టు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

వైసీపీ నుంచి భారీగా చేరికలు

అధికార వైసీపీకి చెందిన 16 మంది సర్పంచులు, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు ..వేదికపై చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పార్టీ కండువాలు కప్పారు. పెదబయలు మండలం బొంగరం సర్పంచ్ లక్ష్మీపతి, పెదబయలు ఎంపీటీసీ సభ్యుడు కె.బొంజిబాబు, డుంబ్రిగుడ మండలం సొగర సర్పంచ్ కొర్రా తౌడమ్మ, గుంటగన్నెల సర్పంచ్ తాంగుల మోత్తి, అర్మా సర్పంచ్ కిల్లో మల్లేశ్, లైగండ సర్పంచ్ తామల శాంతి, కొర్రాయి సర్పంచ్ పూజారి కమల, అరకులోయ మండలం చినలబుడు సర్పంచ్ బురిడి ఉపేంద్ర, పీసీఎస్ మాజీ అధ్యక్షుడు బురిడి కొమ్ములునాయుడు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈసారి అరకు పార్లమెంటు స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను గెలిపించి తీరాలని, వైసీపీని ఇంటికి పంపాలని ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు.

అరకు అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొర

... 5వ పేజీ తరువాయి

వైసీపీని ఇంటికి పంపించి, దొన్నుదొరను గెలిపించుకోవాలన్నారు. వైసీపీ అరాచకాలను ప్రతి ఇంటికీ తెలిపాలని పార్టీ శ్రేణులకు బాబు సూచించారు. ఈ ప్రాంతం నుంచి పార్టీకి సేవలందించిన కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమ సేవలను గుర్తు చేస్తూ ఇద్దరు మంచి నాయకులను కోల్పోవడం దురదృష్టకరమని బాబు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వారి బిడ్డలైన శ్రావణ్‌కుమార్, అబ్రహంలకు సముచిత స్థానం కల్పిస్తామని, వారి గురించి తాను చూసుకుంటానని సభాముఖంగానే చంద్రబాబు వారికి భరోసా ఇచ్చారు. దీంతో కిడారి శ్రావణకుమార్, సివేరి అబ్రహంల అనుచరులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- 'రా.. కదలిరా' సభకు భారీగా తరలిన గిరిజనం
- జిల్లా కేంద్రం పాడేరులోనూ సందడి వాతావరణం

పాడేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డుంబ్రిగుడ మండలం అరకులో శనివారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ 'రా.. కదలిరా' బహిరంగ సభకు పాడేరు అసెంబ్లీ నియోజవర్గం నుంచి వేలాదిగా టీడీపీ శ్రేణులు, అభిమానులు, గిరిజనులు తరలివెళ్లారు. పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఐదు మండలాల్లో అన్ని పంచాయతీల నుంచి చంద్రబాబు సభకు అధిక సంఖ్యలో గిరిజనులు హాజరయ్యారు. కార్యక్రమం అరకులోయ అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో జరుగుతున్నప్పటికీ పాడేరు అసెంబ్లీ నియోజవర్గం నుంచి 25 వేల మందికి తక్కువ కాకుండా జనాన్ని తరలించాలని అరకులోయ పార్లమెంట్ పరిశీలకుడు నక్కా ఆనందబాబు, రా.. కదలిరా కార్యక్రమం పరిశీలకుడు వేణుగోపాలరాయుడు పర్యవేక్షణలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి భారీ స్థాయిలో జనాన్ని తరలింపునకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. దీంతో నియోజకవర్గంలో మండల, పంచాయతీ, గ్రామ స్థాయిలో టీడీపీ అభిమానులు, గిరిజనులు సైతం బహిరంగ సభకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. వారంతా శనివారం ఉదయం ఆయా వాహనాల్లో అరకులో రా.. కదలిరా సభకు తరలి వెళ్లారు. అలాగే సభలో పాల్గొని తిరిగి పాడేరు చేరుకుని గిడ్డి ఈశ్వరి నివాసం వద్దే వేలాది మంది పార్టీ శ్రేణులు, అభిమానులకు భోజనాలను ఏర్పాటు చేశారు. భోజనాలు అనంతరం ఆయా వాహనాల్లో వారంతా స్వగ్రామాలకు తరలివెళ్లారు. అరకులో చంద్రబాబునాయుడు సభ విజయవంతానికి కృషి చేసిన గిడ్డి ఈశ్వరికి అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

పాడేరు రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరకులో నిర్వహించిన రా.. కదలిరా కార్యక్రమానికి పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పాడేరు నుంచి అరకు వెళ్తున్న వాహనాలకు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తలారిసింగి జంక్షన్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతం బ్రష్టు పట్టిందని, ఎక్కడా అభివృద్ధి జాడ లేదని పేర్కొన్నారు. అలాగే టీడీపీ నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, ఎంపీపీ.ప్రసాద్ కూడా వేలాది మందిని చంద్రబాబు కార్యక్రమానికి తరలించారు. వారు ఏర్పాటు చేసిన వాహనాలకు తలారిసింగి జంక్షన్ వద్ద స్టిక్కర్లు అంటించడంలో నాయకులు, కార్యకర్తలు హడావిడి చేశారు. కాగా, అరకులో చంద్రబాబు నిర్వహించిన రా.. కదలారా కార్యక్రమంతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం రేకెత్తింది.



జనాలతో వెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న గిడ్డి ఈశ్వరి



పాడేరులో గిడ్డి ఈశ్వరి ఇంటి నుంచి అరకు సభకు వెళ్తున్న వాహనాలు

అంగన్‌వాడీలతో జగన్‌కు ప్రతిఘటన తప్పదు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్
- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె, నిరసనలు

పాడేరు రూరల్, జనవరి 20: సీఎం జగన్‌కు అంగన్‌వాడీల నుంచి ప్రతిఘటన తప్పదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల సహనాన్ని పరీక్షించడం సీఎంకు తగదన్నారు. మన్యంలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందిన ముంచంగిపుట్టు మండలం దారెల అంగన్‌వాడీ కార్యకర్త పాంగి సౌభాగ్య చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడేరులో ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రాభివృద్ధి చేసింది లేదన్నారు. అనంతరం పీటీడీ కాంప్లెక్స్ ఎదురుగా ప్రజా సంఘాలతో కలిసి అంగన్‌వాడీలు రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎల్.సుందరరావు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీ సౌభాగ్య మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం, షోకాజు నోటీసులు జారీ చేయడం, వేధింపులకు గురిచేయడంతో ఆరోగ్య సమస్యల బారినపడి మృతి చెందుతున్నారని వాపోయారు. గిరిజన సంఘం, సీఐటీయూ, అంగన్‌వాడీ సంఘాల నాయకులు పి.భీమరాజు, బి.సత్యవతి, దేవి, చిలమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు అంగన్‌వాడీలతో కలిసి ఆందోళన చేపట్టారు. ఇటీవల మరణించిన సౌభాగ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నేత పి.ధనుంజయ్ కోరారు. సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నేతలు చిరంజీవి, పెంటమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

జి.మాడుగుల: ప్రభుత్వం దిగివచ్చేవరకు నిరసనలు విరమించేదిలేదని అంగన్‌వాడీ సంఘం నేత మోదకొండమ్మ తెలిపారు. సమ్మె శిబిరంలో వరహాలమ్మ, కాంతమ్మ, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, జానకమ్మ కూర్చొన్నారు.

పెదబయలు: అంగన్‌వాడీలపై ప్రభుత్వం చూపిస్తున్న నిరంకుశ విధానాల వల్లే అనారోగ్యానికి గురై సౌభాగ్య మృతి చెందిందని యూనియన్ నేతలు సన్నిబాబు, ధర్మన్నపడాల్, రాజమ్మ, కొంబమ్మ, పద్మ, మంగమ్మ, కాసులమ్మ, సుశీల ఆరోపించారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేలా చూడాలని ఆయన కోరారు.



రాస్తారోకో చేస్తున్న పలు సంఘాల నాయకులు, అంగన్‌వాడీలు

స్వతంత్రంగా పోటీ: సివేరి అబ్రహం

అరకులోయ, జనవరి 20: వచ్చే ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేస్తామని ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పోటీ చేసి తన సత్తా చాటుకుంటానని చెప్పారు. తమకు టిక్కెట్ ఇవ్వకుండా వేరొకరి ఇవ్వడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సోమ భార్య ఇచ్చావతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'గిరిజన ఎమ్మెల్యేలపై ఆరోపణలు సరికావు'

అరకులోయ, జనవరి 20: రా.. కదిలిరా బహిరంగ సభలో అధికార పార్టీ గిరిజన ఎమ్మెల్యేలపై చంద్రబాబునాయుడు అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. శనివారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తామని స్పష్టం చేశారు. లేనిపక్షంలో చంద్రబాబు రాజకీయ సన్యాసం చేస్తారా అని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే హితవు పలికారు.

చంద్రబాబుకు సీపీఎస్ ఉద్యోగుల వినతి

పాడేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు వినతిపత్రం సమర్పించారు. టీడీపీ మేనిఫెస్టోలో సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పొందుపర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు లోహితాస్, రమేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

అరకు కాఫీకి చోటు దక్కిందన్నారు. దావోస్‌లో అరకు కాఫీని పరిచయం చేశామన్నారు. త్వరలో ముంబైలో అరకు కాఫీ సెంటర్ రాబోతుందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రపంచం మొత్తం దీనిని బ్రాండింగ్ చేస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే..వైసీపీ గుంజాయ్‌ని ప్రమోట్ చేస్తోందని మండిపడ్డారు. గంజాయి వల్ల యువత నిర్వీర్యమైపోతుందని, వారిని సరైన విధంగా ప్రోత్సహిస్తే ప్రపంచాన్ని జయిస్తారని చంద్రబాబు పేర్కొన్నారు. పాతికేళ్ల క్రితం ఐటీని ప్రమోట్ చేస్తే రాష్ట్ర యువత ఇప్పుడు ప్రపంచం మొత్తం సత్తా చాటుతున్నారన్నారు.

గత ఎన్నికల్లో జగన్‌ను నమ్మి ఓటేస్తే ఆయన గిరిజనుల గొంతు కోశారని చంద్రబాబునాయుడు ఆరోపించారు. తెలుగుదేశం హయాంలో గిరిజనులకు అన్ని రకాలుగా చైతన్యపరచి వారి అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేశామన్నారు. దివంగత ఎన్టీరామారావు సీఎం ఉన్నప్పుడు గురుకులాలు ఏర్పాటు జరిగిందన్నారు. ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఉండాలని 2003లో తాము జీవో-3 తీసుకువచ్చామన్నారు. గిరిబిడ్డలకు అన్యాయం చేసేలా దానిని జగన్ రద్దు చేశారని దుయ్యబట్టారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ప్రారంభించి సామాజిక న్యాయం చేస్తున్నానని చెప్పుకుంటున్న జగన్..గిరిజన బిడ్డలకు ఉపాధి ఇచ్చే జీవో-3 ఎందుకు రద్దు చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో-3 అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

గిరిజనులకు చెందిన 16 పథకాలు రద్దు చేశారు....

అధికారంలోకి వచ్చినప్పటి ఇప్పటివరకూ గిరిజనులకు జగన్ ఒక్క మంచి పని అయినా చేశారా...అని చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. అదేమంటే బటన్ నొక్కుతున్నాను కదా అంటారని, గిరిజనుల కోసం ఏ బటన్ నొక్కారని నిలదీశారు. జగన్ సీఎం అయిన తరువాత గిరిజనులకు చెందిన మొత్తం 16 పథకాలు రద్దు చేశారని ఆరోపించారు. గిరి బిడ్డలను సివిల్స్‌లో శిక్షణ కోసం ఎన్టీఆర్ విద్యాజ్యోతి పథకం, గిరిపుత్రిక కళ్యాణ్ యోజన రద్దు చేశారన్నారు. నాణ్యమైన విద్య అందించడానికి బెస్ట్ అవైలబుల్ స్కూళ్లను ప్రవేశపెడితే వాటిని రద్దు చేశారని ఆరోపించారు. కేంద్రం 60 శాతం నిధులు ఇచ్చే ట్రైకార్ పథకానికి 40 శాతం గ్రాంటు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో గడచిన ఐదేళ్లలో ఈ పథకం నిలిపివేశారన్నారు. గిరిజన ప్రాంతాలకు తాము దోమ తెరలు సరఫరా చేస్తే ఇప్పుడు దానిని ఎత్తివేశారన్నారు. పిల్లలు, గర్భిణులకు పోషకాహారం అందించే పథకం నిలిపివేశారన్నారు. అత్యవసర వైద్యం కోసం ఫీడర్ అంబులెన్స్‌లు తీసుకువస్తే ఇప్పుడవి కనిపించడం లేదన్నారు. 50 ఏళ్లు నిండిన గిరిజనులకు పింఛన్ అమలు చేస్తే..45 ఏళ్లకే పింఛన్ ఇస్తానని మోసం చేశారని, ఇప్పటివరకు దానిని అమలు చేయలేదని ఆరోపించారు. ఇంటి నిర్మాణానికి కేంద్రం ఇచ్చే సాయానికి అదనంగా టీడీపీ ప్రభుత్వం రూ.లక్ష ఇచ్చిందని, అయితే జగన్ మాత్రం ఇళ్లు కట్టించి ఇస్తానని మోసం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. గిరి నెట్ పేరుతో ఏజెన్సీలో 184 మొబైల్ టవర్లు ఏర్పాటుచేశామన్నారు. విశాఖలో అల్లూరి సీతారామరాజు మ్యూజియం ఏర్పాటుకు నిర్ణయిస్తే దానిని మూలనపడేశారన్నారు. విశాఖలో రుషికొండకు బోడిగుండు చేసిన జగన్‌కు మరోసారి అధికారం ఇస్తే అరకు కొండలకు కూడా గుండు కొట్టిస్తారని హెచ్చరించారు. ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను తెలుగుదేశం వ్యతిరేకించిందని, వైసీపీ వచ్చిన తరువాత లేటరైట్ ముసుగులో బాక్సైట్ తవ్వుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఏజెన్సీలో లేటరైట్‌ను తవ్వి సీఎం సతీమణి భారతిరెడ్డికి చెందిన భారతి సిమెంట్ కంపెనీకి తరలిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల సంపద దోచుకుంటున్న జగన్ ఈ ప్రాంతానికి ఒక్క రోడ్డు కూడా వేయలేదని వ్యాఖ్యానించారు.

జగన్ మోసాలకు బలికావొద్దు

కులం, మతం పేరుతో జగన్ చేస్తున్న మోసాలకు ఎవరు బలికావద్దన్నారు. మతం, కులం, ప్రాంతం తిండిపెట్టవని, సుపరిపాలన, అభివృద్ధి ఫలాలు అందిస్తే ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. తాను పెత్తందారునని జగన్ విమర్శిస్తుంటారని, అయితే దేశంలోనే అత్యంత ధనవంతుడైన సీఎంగా ఆయనకు రికార్డు ఉందన్నారు. పేదల పక్షపాతిగా చెప్పుకుంటున్న జగన్ వేల కోట్ల ఆస్తులు సంపాదనకు ఏ మంత్రం జపిస్తున్నారో...దానిని చెబితే గిరిజనులు ధనవంతులవుతారని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కొత్త వేషంతో జగన్ వస్తారని పేర్కొంటూ ప్రజలంతా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వైసీపీలో 90 మంది ఓడిపోతారని సర్వేలు వచ్చాయన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న నిత్యావసర ధరలు

ప్రజలకు మంచి పాలన ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి దుర్మార్గుడిలా ప్రవర్తిస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. నిత్యం బటన్ నొక్కుతానని సీఎం చెబుతుంటారని, దానివల్ల ప్రజలకు ఇచ్చేది పిసరంత...ఆయనకు మాత్రం లాభం కొండంత అని విమర్శించారు. ఐదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరగడంతో ప్రజల నడ్డి విరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. కిలో బియ్యం రూ.40 నుంచి రూ.60కు, కందిపప్పు రూ.80 నుంచి రూ.160కు, చింతపండు రూ.122 నుంచి రూ.240కు పెరిగాయన్నారు. విద్యుత్ చార్జీలు ఐదు రెట్లు పెంచేశారని అన్నారు. ఒకప్పుడు దీపం కింద గ్యాస్ పథకం అమలు చేస్తే ఇప్పుడే పెరిగిన ధరలతో కట్టెల పొయ్యిలో వంట చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. తాము ఇంటింటికీ కేబుల్ టీవీ ప్రసారాలను రూ.149కి అందిస్తే ఇప్పుడు రూ.350కు పెంచారని ఆరోపించారు. చివరకు నాసిరకం మద్యం అమ్మకాల వల్ల 35 లక్షల మంది అనారోగ్యానికి గురికాగా, 30 వేల మంది చనిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారం సీఎం చేస్తున్నారని, డబ్బు పిచ్చితో నాసిరకం మద్యం తాగడంతో మహిళల తాళిబొట్లు తెగిపోయే పరిస్థితి వచ్చిందన్నారు.